క్లుప్తంగా

ఘనంగా కళాశాల వీడ్కోలు సంబరం



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మునగపాక: మునగపాక నేషనల్ జూనియర్ కళాశాలలో వీడ్కోలు సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఎస్‌ఎం ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె.బాల సంజీవరావు, అధ్యాపకులు గణేష్, ఆనంద్, సాయిరాం, శ్రీను, వెంకట్, గీత, లిఖిత, కుసుమ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పరదేశమ్మ తల్లి పుట్టుక మహోత్సవం



పరదేశమ్మ తల్లి సన్నిధిలో సర్పంచ్ అప్పారావు

మునగపాక: మునగపాకలో పరదేశమ్మ తల్లి పుట్టుక మహోత్సవం ఘనంగా జరిగింది. టెక్కలి ఇంటి పేరు కలిగిన కుటుంబ సభ్యులంతా సోమవారం అర్ధరాత్రి తర్వాత ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి పూజలు చేశారు. వచ్చే నెల 25న అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయించారు. దీనిలో భాగంగా అమ్మవారి పుట్టుక మహోత్సవాన్ని భారీ మందుగుండు సామగ్రి వెలిగించి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

దళితవాడలో దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. దళితవాడలో దోమల నివారణకు జరుగుతున్న దోమల మందు పిచికారీ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇళ్ల ముందు నీటి నిలువలు లేకుండా చూడాలన్నారు. దళితవాడ అభివృద్ధికి అవసరమయ్యే చర్యలు తీసుకుంటున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవ మూర్తుల ఊరేగింపు



పందూరులో ఉత్సవ మూర్తులను ఊరేగింపు కోసం తోడ్కొని వెళ్తున్న భక్తులు

కోటవురట్ల: పందూరు వరాహనది తీరాన వేంచేసిన శ్రీ ఉమాసహిత వరాహ లింగేశ్వర దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి సారె తోడ్కొని వెళ్లారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. బుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. లింగోద్భవ సమయంలో రుద్రాభిషేకాలు చేస్తారన్నారు.

మెలిపాకలో నేడు రాజుబాబు పండగ

మునగపాక: మండలంలోని మెలిపాకలో బుధవారం రాజుబాబు పండగ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా శివరాత్రి పర్వదినం సందర్భంగా పండగ నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా గ్రామస్తుల సహకారంతో పండగ జరుపుకుంటున్నారు. రాత్రి గ్రామంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మునగపాక: మండలంలోని కాకరాపల్లి శివారులో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకరాపల్లి శివారులో పేకాడుతున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం దాడి చేశామన్నారు. ఈ దాడిలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.21,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ప్రసాదరావు తెలిపారు.

ప్లాస్టిక్ ఫుల్.. నిషేధం నిల్



తుమ్మెకుల గెడ్డలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



కోటవురట్ల: పర్యావరణానికి పెనుముప్పు కలిగిస్తూ, జీవరాశి ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది పాలిథిన్. వివాహాది శుభ కార్యాల్లోనే కాకుండా నిత్య జీవనంలోనూ ప్లాస్టిక్ ఓ భాగమైపోయింది. ప్లాస్టిక్ లేని ప్రదేశమే లేదంటే అతిశయోక్తి కాదు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు తెలిసినా ప్రజలు దీని వినియోగాన్ని మాత్రం వదిలిపెట్టడంలేదు. ప్లాస్టిక్ నిషేధం ఉన్నా అమలుకు నోచుకోక యథేచ్ఛగా వినియోగించబడుతోంది. పర్యావరణానికి హాని కలిగిస్తూ పెనుసవాల్‌గా మారిన ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు. నియంత్రణ లేకపోవడం, పర్యవేక్షణ కొరవడడం, దాడులు లేకపోవడంతో ప్రతి దుకాణంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. అధికారుల దాడులు లేకపోవడంతో చిన్న,పెద్ద దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు ఇష్టారీతి వాడుతున్నారు. హోటళ్లు, కూరగాయలు, చికెన్, చేపలు, కిరాణా, స్వీట్స్, బేకరీలు, ఫ్యాన్సీ షాపులు ఇలా ప్రతి దుకాణంలోనూ ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. వాడిన కవర్లను ఎక్కడ పడితే అక్కడ పడేయడంతో అవి భూమిలో కలవక పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయి.

ప్లాస్టిక్‌తో క్యాన్సర్..

ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, బాటిల్స్ వినియోగంతో క్యాన్సర్ చుట్టుముడుతోంది. ఎటువంటి చెడు అలవాట్లు లేని వ్యక్తులు కూడా ప్లాస్టిక్ వినియోగంతో క్యాన్సర్ బారిన పడి మృత్యువాత పడుతున్నారు. ప్లాస్టిక్ కవర్లలో తీసుకొచ్చిన వేడి ఆహారాన్ని తినడం, ప్లాస్టిక్ సీసాలలో నీటిని తాగడం, ప్లాస్టిక్ కవర్లతో తెచ్చిన టీ, కాఫీ తాగడం వల్ల రసాయనాలు శరీరంలోకి వెళ్లి క్యాన్సర్ వస్తోంది. ప్లాస్టిక్ వినియోగం బాగా పెరగడంతో క్రమేపీ మనిషి జీవిత కాలం తగ్గుతూ వస్తోంది.

- ఎక్కడ చూసినా నిషిద్ధ ప్లాస్టిక్ వ్యర్థాలే
- అంతంతమాత్రంగా అధికారుల చర్యలు
- అవగాహనతోనే దీనికి అడ్డుకట్ట అంటున్న పర్యావరణవేత్తలు

నిబంధనలు తూచ్..

సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 40 మైక్రాన్ల మందం కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ నిషేధించబడింది. అలా కాకుండా నిబంధనలు అతిక్రమించి వినియోగిస్తే వారిపై కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి అధికారులు దుకాణాలపై దాడులు చేసి కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేస్తే పర్యావరణాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యం, నిరాసక్తత కారణంగా దుకాణాలలో తక్కువ ధరకు వస్తున్న ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. దాంతో ఎక్కడ చూసి ప్లాస్టిక్ భూతమే కనిపిస్తోంది. మూగజీవాలు, జలచరాలు ఆకలికి తట్టుకోలేక ప్లాస్టిక్ కవర్లు తిని మృత్యువాత పడుతున్నాయి.



కోటవురట్ల మెయిన్ రోడ్డులో పేరుకుపోయిన పాలిథిన్ కవర్లు

ప్లాస్టిక్ వినియోగం ఆపేయాలి..



ప్లాస్టిక్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం కలిగించాల్సి ఉంది. వర్తకులు కూడా పర్యావరణాన్ని కాపాడేందుకు ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు ఆపేయాలి. ప్రజలు సరకులు కొనేందుకు గుడ్డ సంచులు తెచ్చుకోవాలి. అందరి సమష్టి కృషితోనే ప్లాస్టిక్ నిషేధం అమలవుతుంది.

–తుమ్మలపల్లి ఆంజనేయులు, మరిడిమాంబ వర్తక సంఘం అధ్యక్షుడు, కోటవురట్ల

అధికారుల ఆదేశాలు బేఖాతర్..



ప్లాస్టిక్ వినియోగం బాగా పెరిగిపోయింది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ తక్కువ రకం ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు. అధికారులు పటిష్ఠంగా నిషేధాన్ని అమలు చేయాలి.

– బి.అనిల్‌కుమార్, సర్పంచ్, కోటవురట్ల

అంబరాన్నంటిన శూలాల పండగ



నక్కపల్లిలో శూలాల పండగ నిర్వహిస్తున్న భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న నాయకులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో శూలాల పండగ సోమవారం రాత్రి అంబరాన్నంటింది. పద్మశాలీలు తమ ఆరాధ్యదైవం శ్రీ భద్రావతి సమేత భావనారుషి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తెల్లవార్లు బందారు పేట, అద్దాలవీధి, ఉపమాక రోడ్డు, వీవర్స్ కాలనీల్లో సందడి నెలకొంది. ప్రభలను ప్రత్యేకంగా తయారు చేసి ఊరేగింపు కార్యక్రమంలో భాగంగా నాలుకపై శూలాలు గుచ్చుకుని నృత్యాలు చేస్తూ భక్తులంతా సందడి చేశారు. భారీ ఊరేగింపు, నేల వేషాలు, బళ్లవేషాలు, తీన్మార్ డ్యాన్సులు, కోలాటాలతో సందడి నెలకొంది. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, ఉప సర్పంచ్ వీసంరాజు, అల్లాడ కొండ, ఎల్లేటి సత్తిబాబు, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీపై దృష్టి పెట్టండి



అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ రఘురాం

కోటవురట్ల: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు అందరూ కృషి చేయాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు కోరారు. తంగేడులో సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ రఘురాం మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేయడం వల్ల కలిగే మేలు, సేంద్రియ ఎరువు తయారీ, స్వచ్ఛ గ్రామాల కోసం అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబైన శివాలయాలు



మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడి



ముస్తాబైన పెదఉప్పలం శ్రీ బ్రహ్మలింగేశ్వరస్వామి



గోపాలపట్నంలోని సీతమ్మ కొండపై కొలువున్న ఉమా ధర్మలింగేశ్వరస్వామి

మునగపాక: మహా శివరాత్రి నేపథ్యంలో వాడ్రాపల్లిలోని దక్షిణేశ్వరుని ఆలయం, నాగులాపల్లిలోని పురాతన శివాలయంతో పాటు మునగపాక లింగరాయిగుడి, సాంబశివుని ఆలయం, తోటాడలోని శ్రీ భద్రావతి సమేత శ్రీ భావనా రుషి ఆలయం ప్రత్యేక పూజలకు సిద్ధమయ్యాయి.

శివజాగరణకు ఏర్పాట్లు..

ఎస్.రాయవరం: మండల కేంద్రంలోని శ్రీ బుర్రేశ్వరస్వామి, సర్వసిద్ధి శ్రీ సిద్ధి లింగేశ్వరస్వామి, దార్లపూడి వరాహ లింగేశ్వరస్వామి, పెదగుమ్ములూరు శ్రీ ఉమాలింగేశ్వరస్వామి, వేమగిరి,పెనుగొల్లు శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాల్లో శివ జాగరణకు ఏర్పాట్లు చేశారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట: మండలంలోని గోపాలపట్నంలో గల సీతమ్మకొండపై శ్రీఉమా ధర్మలింగేశ్వరస్వామి ఆలయం, పెదద్దిపాలెం, సత్యవరం, పెంటకోట, నామవరం గ్రామాల్లోను, పట్టణంలో గల గాజుగారి బీడు, బృందావనం, లింగాల కాలనీల్లో గల శివాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఆలయాలకు ముస్తాబు..

అచ్యుతాపురం: మండలంలోని దోసూరు, నునపర్తి, పూడిమడక, చీమలాపల్లిలో పలు గ్రామాల్లోని శివాలయాలను శివ పూజల కోసం అందంగా అలంకరించారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ



ధర్మవరం అగ్రహారం పాఠశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కోటవురట్లలో మాట్లాడుతున్న ఎంఈవో-1 రామారావు



కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న రిసోర్సుపర్సన్



కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చార్టులు చూపుతున్న టీచర్లు

ఎస్.రాయవరం: జ్ఞానజ్యోతి కార్యక్రమంలో శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు నర్సరీ పాఠాలు నేర్పాలని డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. ధర్మవరం అగ్రహారం పాఠశాలలో వారం రోజులు మండల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన శిక్షణ మంగళవారంతో ముగిసిందన్నారు. శిక్షణ పొందిన కార్యకర్తలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు అక్షరాలు నేర్చుకుంటే ప్రాథమిక స్థాయి నుంచి చదువులో రాణిస్తారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో స్వప్న ప్రియరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, డీఆర్పీ వై. శివకృష్ణ, సూపర్‌వైజర్ తులసి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పూర్తయిన శిక్షణ..

నక్కపల్లి: మండలంలో 73 మంది అంగన్‌వాడీ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి, గుణాత్మకమైన విద్యనందించేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని ఎంఈవో కుంచం నరేష్ అన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది తయారు చేసిన పలు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ప్రదర్శించారు. శిక్షణ పూర్తి చేసుకున్న కార్యకర్తలకు సర్టిఫికెట్లు అందజేశారు.

జ్ఞానజ్యోతితో విద్యా వికాసం..

యలమంచిలి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇస్తున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం సాయంత్రంతో ముగిసింది. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ స్కూళ్లగా మార్పు చేయడానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా మూడు నుంచి ఐదేళ్ల మధ్య వయసు గల చిన్నారులకు ఆటపాటలతో చదువు చెప్పేలా జ్ఞానజ్యోతి పేరిట అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఆటపాటలతో సులువుగా విద్య నేర్చుకునేలా బొమ్మ లు, చార్టులు తయారు చేయించి, సృజనాత్మకత జో డించి ఎలా బోధించాలో రిసోర్సు పర్సన్లు అంగన్ వాడీ టీచర్లకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ శిక్ష ణను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 అరుణ్ కుమార్, కొత్తపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమణ, రిసోర్సు పర్సన్లు ప్రేమ్‌కుమార్, రాజాబాబు, 56 మంది అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

కోటవురట్ల: చిన్నారుల్లో విద్యపై ఆసక్తిని పెంచేలా అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఎంఈవోలు రామారావు, శ్రీజోష్ కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18వ తేదీ నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు మాట్లాడుతూ గుణాత్మకమైన విద్యతో చిన్నారుల్లో మార్పు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.లక్ష్మి, డీఆర్‌పీలు వేమేశ్వరరావు, వెంకట అప్పారావు, సూపర్‌వైజర్లు కనకదుర్గ, హైమావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలు ఎన్నాళ్లు?



కిల్లాడ శ్రీనివాసరావు

కోటవురట్ల: ఇచ్చిన హామీలు పక్కన పెట్టి గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం తన ఖాతాలో వేసుకోవడం పరిపాటిగా మారిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పందూరు వంతెన గురించి ఇటీవల ఓ టీడీపీ నాయకుడు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. గత ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు కృషితో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పందూరు వంతెనకు నాబార్డు ద్వారా రూ.4.50 కోట్లు మంజూరు చేశారన్నారు. టెండర్ల ప్రక్రియ ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయిందన్నారు. అయితే పందూరు వంతెనకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఓ టీడీపీ నాయకుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు దాటుతున్నా నేటికీ సూపర్ సిక్స్ మాటే లేదన్నారు. రామచంద్రపురం నుంచి అడ్డురోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి కూడా గత ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. రోడ్డు పనులకు పలుమార్లు ప్రారంభోత్సవాలు చేస్తున్నారే తప్ప అది పూర్తయ్యే అవకాశం కనిపించలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో దాదాపు 70 శాతం రహదారులు అభివృద్ధి చెందగా అక్కడక్కడా మిగిలిపోయిన రోడ్లలో గుంతలు పూడ్చి అభివృద్ధి చేస్తున్నట్టు కూటమి నాయకులు ప్రజల చెవుల్లో పూలు పెడుతున్నారన్నారు. మాటలు కట్టిపెట్టి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఎద్దేవా చేశారు. లేదంటే ప్రజలు తొందరలోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



పాఠశాలలో నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థి

అచ్యుతాపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. టెన్త్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు విద్యార్థులు జ్ఞాపికలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు ఒకరికొకరు పలకరించుకొని ఉద్వేగానికి లోనయ్యారు. ఉత్సాహంగా, ఉద్వేగంగా పూర్తయిన వీడ్కోలు కార్యక్రమం ఘనంగా ముగిసింది.

సక్రమ డ్రైవింగ్‌తోనే సురక్షిత ప్రయాణం



డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

ఎస్.రాయవరం: ప్రైవేటు పరిశ్రమల డ్రైవర్లు వాహనాలు వేగంగా నడిపి ప్రమాదాలకు కారకులవుతున్నారని అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ అన్నారు. అడ్డురోడ్డులోని కార్యాలయం వద్ద మంగళవారం హెటిరో పరిశ్రమ బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడి కూడలిని ఆనుకుని అనేక పరిశ్రమల బస్సులు పెద్ద సంఖ్యలో రవాణా సాగిస్తున్నాయని, డ్రైవింగ్ సక్రమంగా చేసి కార్మికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. ఇరుకురోడ్లలో నెమ్మదిగా ప్రయాణించి తోటి వాహనాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రధాన జంక్షన్లలో రద్దీగా ఉన్న సమయాల్లో బస్సుల రాకపోకల సమయాలు మార్పు చేసుకోవాలన్నారు. అలాగే పరిశ్రమల వారీగా మిగిలిన డ్రైవర్లకు కూడా అవగాహన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ విభీషణరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు కళ్లద్దాల పంపిణీ



బాలికలకు కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి మనీషా

కశింకోట: తాళ్లపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం 69 మంది బాలికలకు ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేశారు. గతంలో బాలికలకు పరీక్షలు నిర్వహించిన సందర్భంగా కంటి లోపాలను గుర్తించి సిఫార్స్ చేసిన నేపథ్యంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో వీటిని అందించారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ. మనీషా పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎం.ఎస్.వి. ప్రసాద్, ఆప్తాలమిక్ యు. ఆనందరావు, ఆప్తాలమిక్ ఆఫీసర్ సి.హెచ్. ప్రసాద్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి. గ్రేస్, ఆరోగ్య పర్యవేక్షకుడు కె.ఎస్.ఆర్.కె.జి. నరసింహారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి ప్రచారం



ప్రచారం చేస్తున్న విజయగౌరి

అచ్యుతాపురం: ఎంఎల్‌సీ ఎన్నికల్లో పీడీఎఫ్, యూటీఎఫ్ బలపరిచిన విజయ గౌరి అచ్యుతాపురం మండలంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27న నిర్వహించనున్న ఎంఎల్‌సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆమె ఉపాధ్యాయుల్ని అభ్యర్థించారు. ఉత్తరాంధ్ర నుంచి ఒక మహిళను శాసన మండలికి పంపించాలని పలువురు కోరారు. పీడీఎఫ్ నాయకులు వెంకట అప్పారావు, ప్రకాశ్, రాము, పార్వతి తదితరులు పాల్గొన్నారు.